నేనే సీఎం.. కాదు నేనే సీఎం

కాంగ్రెస్‌లో అందరూ సీఎం అభ్యర్థులే

- సీఎంలతో అధిష్ఠానం తోలుబొమ్మలాట
- 40 ఏండ్ల పాలనలో ఇద్దరికే అదృష్టం
- 1978లో ఐదేండ్లలో నలుగురు సీఎంలు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి నిల్
- సీఎం పదవిపై ఉత్తమ్, రేవంత్, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, జగ్గారెడ్డి, వివేక్ వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్.. దేశంలో ఎవరికీ అర్థంకాని బ్రహ్మపదార్థం ఏదైనా ఉందంటే అది ఈ పార్టీనే. నిత్యం గందరగోళం.. అయోమయం. ఆ పార్టీ గెలిచిన రాష్ట్రాల్లో ఎప్పుడు ఎవరు సీఎంగా ఉంటారో తెలియదు. ఈ రోజున్న వారు రేపు ఉండకపోవచ్చు. రేపున్నవారు ఎల్లుండి పార్టీలోనే లేకుండా పోవచ్చు. ఐదేండ్లలో ఎంతమంది సీఎంలుగా ఉంటారో తెలియదు. ఇక, అంతర్గత కుమ్ములాటలు, లాబీయింగ్‌లు, క్యాంపులు, కుట్రలు, కుతంత్రాలు.. ఇలాంటివన్నీ కాంగ్రెస్‌లో సర్వసాధారణ విషయాలు. వీటిన్నంటి కంటే మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. పార్టీలో అందరూ సీఎం అభ్యర్థులే. ప్రజలిచ్చిన అధికారం మొత్తం కుర్చీని కాపాడుకునేందుకే సరిపోతే ఇక అభివృద్ధి ఊసుక్కెడ? ప్రజల కష్టాలు పట్టేదెప్పుడు? అందుకనే కాంగ్రెస్ పాలిత ప్రాంతాలు అభివృద్ధిలో అట్టడుగున ఉంటాయనేది రాజకీయ విశ్లేషకుల మాట. అటు రాజస్థాన్ కానీ, ఇటు కర్ణాటక కానీ కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా ఇదే తీరు. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ మధ్య పోరు నడిస్తే.. కర్ణాటకలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య జరుగుతున్న పోరును ఆ రాష్ట్ర ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు.

40 ఏండ్లు 16 మంది సీఎంలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ దాదాపు 40 ఏండ్ల పాటు అధికారంలో ఉంది. అంటే ఈ 4 దశాబ్దాల్లో ఐదేండ్లకు ఒకరు చొప్పున 8 మంది సీఎంలు ఉండాలి. కానీ 16 మంది ముఖ్యమంత్రులుగా అధికారం చెలాయించారు. సీఎంలను కాంగ్రెస్ ఎడాపెడా మారుస్తుందని చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలేమో. 1978 ఎన్నికల తర్వాత ఏకంగా నలుగురు సీఎంలను మార్చింది. వీరిలో మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు. వీరిలో కోట్ల అత్యంత దారుణంగా మూడు నెలలు (111 రోజులు) మాత్రమే సీఎంగా ఉన్నారు. 40 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఇద్దరు మాత్రమే పూర్తిస్థాయి సీఎంలుగా పనిచేశారు. 1964 ఎన్నికల తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి ఏడేండ్లు సీఎంగా పని చేయగా, 2004 తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదేండ్లకు పైగా సీఎంగా పని చేశారు. వీరిద్దరు మినహా మిగిలిన వారంతా ఏడాది, రెండేండ్లు సీఎంగా ఉండి కుర్చీని విడిచిపెట్టినవారే.

కుమ్ములాటలకు ప్రజాస్వామ్యం ముసుగు

కుమ్ములాటలకు కాంగ్రెస్ పెట్టింది పేరు. దీనికి కాంగ్రెస్ పెట్టుకున్న పేరు అంతర్గత ప్రజాస్వామ్యం. సీఎం కుర్చీకోసం ఆ పార్టీలో జరిగే కుమ్ములాటలు మరే పార్టీలోనూ ఉండవు. కాంగ్రెస్ సీఎంలు అభివృద్ధి కంటే కూడా కుర్చీని కాపాడుకునేందుకే ఎక్కువ శ్రమిస్తుంటారని చెబుతుంటారు. కుమ్ములాటలు మరీ ఎక్కువైనప్పుడు మాత్రం అధిష్ఠానం రంగంలోకి దిగి వెంటనే సీఎంను మార్చేసి అప్పటికి పరిస్థితిని చల్లబరుస్తుంది. ఆ తర్వాత మళ్లీ మామూలే.

పాలనపై పెను ప్రభావం

కుర్చీలో కుదురుకుని ఇక పాలనపై దృష్టి పెట్టే సమయానికి సీఎంల మార్పు వల్ల అభివృద్ధి అటకెక్కుతున్నది. సీఎంలు మారినప్పుడల్లా ప్రాధాన్యాలు కూడా మారుతుండడం వల్ల ఆ పార్టీ ప్రకటించిన ఏ పథకమూ ముందుకు సాగిన దాఖలాలు లేవు. అందుకనే 40 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కునారిల్లింది. కాంగ్రెస్ పాలిత మిగతా రాష్ట్రాల్లోనూ అదే పరిస్థితి

> **ఒకరికి మించి మరొకరు**
>
> *ప్రస్తుత విషయానికి వస్తే రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలందరూ ఎవరికి వారే సీఎం అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారు. ఈ జాబితాలో జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, మధుయాష్కీగౌడ్.. చెప్పుకుంటూ పోతే చాలామంది ఆ రేసులో ఉన్నారు. సీఎం పదవి తనను వెతుక్కుంటూ వస్తుందంటారు జానారెడ్డి. ఎప్పటికైనా తానే సీఎంనని అంటారు కోమటిరెడ్డి. రేవంత్ అయితే తానే సీఎంనని చెప్పుకొని తిరుగుతున్నారు. వచ్చే పదేండ్లలో తానే సీఎం అని ప్రకటించుకున్నారు జగ్గారెడ్డి. వీరి ప్రకటనలు చూసి తెలంగాణ ప్రజలు విస్తుపోతున్నారు. ఖర్మకాలి కాంగ్రెస్ కనుక అధికారంలోకి వస్తే సీఎం సీటు కోసం తన్నుకోవడం ఖాయమని చెబుతున్నారు.*

ఉమ్మడి ఏపీలో సీఎంల జాబితా, పదవీకాలం వివరాలు ఇలా

క్ర.సంఖ్య	సీఎం పేరు	పదవిలోకి వచ్చిన తేదీ	పదవి పోయిన తేదీ	పనిచేసిన కాలం
1.	నీలం సంజీవరెడ్డి	1 నవంబర్ 1956	11 జనవరి 1960	మూడేండ్ల 71 రోజులు
2.	దామోదరం సంజీవయ్య	11 జనవరి 1960	12 మార్చి 1962	రెండేండ్ల 60 రోజులు
3.	నీలం సంజీవరెడ్డి	12 మార్చి 1962	21 ఫిబ్రవరి 1964	రెండేండ్ల 9 రోజులు
4.	కాసు బ్రహ్మానందరెడ్డి	21 ఫిబ్రవరి 1964	30 సెప్టెంబర్ 1971	ఏడేండ్ల 221 రోజులు
5.	పీవీ నరసింహారావు	30 సెప్టెంబర్ 1971	10 జనవరి 1973	ఏడాది 102 రోజులు
6.	జలగం వెంగళ రావు	10 డిసెంబర్ 1973	6 మార్చి 1978	నాలుగేండ్ల 86 రోజులు
7.	మర్రి చెన్నారెడ్డి	6 మార్చి 1978	11 అక్టోబర్ 1980	రెండేండ్ల 219 రోజులు
8.	టంగుటూరి అంజయ్య	11 అక్టోబర్ 1980	24 ఫిబ్రవరి 1982	ఏడాది 136 రోజులు
9.	భవనం వెంకట్రామిరెడ్డి	24 ఫిబ్రవరి 1982	20 సెప్టెంబర్ 1982	208 రోజులు
10.	కోట్ల విజయభాస్కర్‌రెడ్డి	20 సెప్టెంబర్ 1982	9 జనవరి 1983	111 రోజులు
11.	మర్రి చెన్నారెడ్డి	3 డిసెంబర్ 1989	17 డిసెంబర్ 1990	ఏడాది 14 రోజులు
12.	ఎన్. జనార్దన్‌రెడ్డి	17 డిసెంబర్ 1990	9 అక్టోబర్ 1992	ఏడాది 297 రోజులు
13.	కోట్ల విజయభాస్కర్‌రెడ్డి	9 అక్టోబర్ 1992	12 డిసెంబర్ 1994	263 రోజులు
14.	వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	14 మే 2004	2 సెప్టెంబర్ 2009	ఐదేండ్ల 111 రోజులు
15.	రోశయ్య	3 సెప్టెంబర్ 2009	25 నవంబర్ 2010	ఏడాది 83 రోజులు
16.	కిరణ్‌కుమార్‌రెడ్డి	25 నవంబర్ 2010	1 మార్చి 2014	మూడేండ్ల 96 రోజులు

లోకం పోకడ

టికెట్ వద్దని పారిపోతుంటే పట్టుకొచ్చాం!

9 వరకు వర్షాలు

- పలు జిల్లాల్లో తేలికపాటి వానలు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వర్షాలపై హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ నెల 9 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. బంగాళాఖాతం నుంచి దక్షిణ ద్వీపకల్ప భారతదేశం, అలాగే బంగాళాఖాతంపై ద్రోణి వరకు బలమైన తూర్పు, ఈశాన్య గాలుల ప్రభావంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. నాగర్‌కర్నూలు, వనపర్తి, జోగులాంబ-గద్వాల్, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఏపీకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నందున ఈ నెల 6వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	36.1°c	20.0°c
రంగారెడ్డి	34.7°c	18.9°c
వరంగల్	34.0°c	23.0°c
ఆదిలాబాద్	33.5°c	16.0°c
ఖమ్మం	33.0°c	24.0°c
కరీంనగర్	33.0°c	23.0°c
మెదక్	32.3°c	18.8°c
నిజామాబాద్	31.9 °c	20.9°c
హైదరాబాద్	31.2°c	23.7°c
మహబూబ్‌నగర్	31.0°c	23.9°c

కాంగ్రెస్‌లో ఎవరైనా సీఎం కావొచ్చు

- ఒక్క ఎమ్మెల్యే మద్దతు లేకున్నా పదవిని చేపట్టవచ్చు
- అట్లా కిరణ్‌కుమార్‌రెడ్డి కాలేదా
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్య

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రి కావచ్చని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోనియాగాంధీ నిర్ణయం ప్రకారం ఎవరైనా సీఎం కావచ్చని చెప్పారు. ఒక్క ఎమ్మెల్యే మద్దతు కూడా లేని కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో సీఎం కాలేదా? అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పదవి రెండూ సమానమేనని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చినా తాను ముఖ్యమంత్రి పదవి అడుగనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గెలిచిన ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు ఎవరికి ఎక్కువ ఎమ్మెల్యేల మద్దతు ఉంటే వాళ్లే సీఎం కావచ్చని, ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌లో ఏదైనా సాధ్యమేనని చెప్పుకొచ్చారు.

అమరావతి జేఏసీ నేత కాంగ్రెస్‌లోకి

- బాబు సూచన మేరకే కలిశానని వెల్లడి
- ఇరువురి భేటీపై అనుమానాలు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఉనికిని అస్థిరపరిచే కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వారందరూ ఇప్పుడు మరోసారి విరుచుకుపడేందుకు సిద్ధమయ్యారు. ఆంధ్రపరిరక్షణ సమితి పేరుతో పనిచేస్తున్న కొలికపూడి శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సమావేశమవ్వడం అనుమానాలకు తావిస్తున్నది. చంద్రబాబు ఆదేశాల మేరకే తాను రేవంత్‌రెడ్డిని కలిశానని, రేవంత్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని, కాంగ్రెస్ విజయం కోసం పనిచేస్తామని కొలికపూడి శ్రీనివాస్ చెప్పడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ కోసం పనిచేస్తున్నామని, ఏపీ ప్రయోజనాలే తమకు ముఖ్యమని చెప్తున్న కొలికపూడి శ్రీనివాస్‌తో రేవంత్‌రెడ్డి భేటీ కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిలువరించేందుకు.. ఆనాడు రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన శక్తులన్నీ ఇప్పుడు మళ్లీ ఏకమవుతున్నాయి. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ముసుగు తొడుక్కొని వస్తున్నారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోవడం సాధ్యంకాక దిక్కులు చూస్తున్న కాంగ్రెస్ తెలంగాణ వ్యతిరేక శక్తుల మద్దతు కోసం అర్రులు చాస్తున్నది. తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని చంద్రబాబు.. తన ప్రియశిష్యుడికి సాయం పేరుతో తెలంగాణ రాజకీయాలను అస్థిర పరిచే పరోక్ష కుట్రకు సిద్ధపడినట్టు తాజా పరిస్థితులు స్పష్టంచేస్తున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో రాజమండ్రి జైలుకెళ్లిన చంద్రబాబు ఆరోగ్య సమస్యతో మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం చికిత్స కోసం హైదరాబాద్‌కు చేరుకున్నారు. జైలు నుంచి విడుదలకు ముందే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసేది లేదని పార్టీ శ్రేణులకు సూచించారు. చంద్రబాబు నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేసిన టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తన పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. చంద్రబాబు వైద్యం కోసం హైదరాబాద్‌కు చేరుకున్న మరుసటి రోజే రేవంత్‌రెడ్డితో శ్రీనివాస్ భేటీ కావడం, కాంగ్రెస్‌కు ఆంధ్ర పరిరక్షణ సమితి మద్దతు ప్రకటించడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు అప్రమత్తమై కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉన్నదని భావిస్తున్నారు.

మెదక్ జిల్లా రామాయంపేట దళితకాలనీలో మైనంపల్లి రోహిత్ మాట్లాడుతుండగా 'జై బీఆర్ఎస్.. పద్మక్క జిందాబాద్' అని నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, స్థానిక దళితులు

మైనంపల్లి రోహిత్‌కు చుక్కెదురు

- రామాయంపేటలో అడ్డుకున్న దళితులు
- బైక్‌లు అడ్డం పెట్టి నాయకుల నిరసన
- కాంగ్రెస్-బీఆర్ఎస్ నేతల తోపులాట

రామాయంపేట, నవంబర్ 3: మెదక్ జిల్లా రామాయంపేటలో హరిజనకాలనీలో మైనంపల్లి రోహిత్‌ను దళితులు అడ్డుకున్నారు. శుక్రవారం ప్రచారం కోసం ఆయన కాలనీకి రాగా, కాలనీలోకి రాకుండా బైకులు అడ్డం పెట్టారు. 'కాంగ్రెస్ నాయకులు మా కాలనీకి రావద్దు.. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి జిందాబాద్.. జై తెలంగాణ.. జైజై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోహిత్ వర్గీయులు బైక్‌లను తొలగించి కాలనీలోకి వచ్చారు. దీంతో తమ కాలనీకి ఎందుకు వచ్చారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న రోహిత్ మైకు తీసుకుని తాము రామాయంపేటను అభివృద్ధి చేయడానికి వచ్చామే తప్ప మరేమి లేదని వివరణ ఇచ్చారు. రామాయంపేటలో పదేండ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదనటంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ అభివృద్ధి జరగలేదో చూపించాలని రోహిత్‌ను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత కల్పించుకొని, రోహిత్‌ను సముదాయించి అక్కడి నుంచి పక్క కాలనీకి తీసుకెళ్లారు. అక్కడ కూడా రోహిత్ మాట్లాడుతుండగా, 'జై తెలంగాణ.. జై పద్మక్క' నినాదాలు హోరెత్తడంతో చేసేదేమి లేక రోహిత్ నడుచుకుంటూ కాలనీవాసులకు దండం పెడుతూ వెళ్లిపోయారు.

సాంకేతికంగా తెలంగాణ ఇవ్వాల్సిన అవసరం లేకున్నా!

సోనియాను పాగిడే తాపత్రయంలో రాష్ట్రం
పుట్టుకను పరోక్షంగా అవమానించిన పీసీసీ చీఫ్

> మొదటిపేజీ తరువాయి...

తప్పుబట్టారు. 'లెక్కల జోలికెళ్తే.. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు ఉన్న ఏపీదే అధిపత్యం. 119 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాలు తెలంగాణలో ఉన్నాయి. ఇవ్వొద్దని ఆంధ్రా, ఇవ్వాలని తెలంగాణ ప్రాంతం వారు కొట్లాడినప్పుడు పార్టీగా, యూపీఏ చైర్‌పర్సన్‌గా సాంకేతికంగా లెక్కలేసుకుంటే రాష్ట్రం ఇవ్వడానికి ఏ కోశానా అవకాశం లేదు. రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్నా ఏ మాత్రం ప్రయోజనం లేదు. నష్టం చేకూర్చే నిర్ణయమే' అంటూ రేవంత్‌రెడ్డి వంకరటింకర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తెలంగాణ రాష్ట్ర పుట్టుకను ఇప్పటికే పలు మార్లు దారుణంగా అవమానించగా, తాజా ఇదే వరుసలో రేవంత్‌రెడ్డి చేరారు. ఏపీ విభజన సరిగ్గా జరగలేదని, అసహజంగా పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్రాలు విభజించారని, తల్లిని చంపి బిడ్డను తీశారంటూ మోదీ రాష్ట్ర పుట్టుకను అవమానించగా, విభజన సరిగ్గా జరగలేదంటూ అమిత్‌షా సైతం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తాజాగా రేవంత్‌రెడ్డి సాంకేతికంగా రాష్ట్రాన్ని ఇవ్వాల్సిన అవసరం లేదని మాట్లాడారు. వాస్తవానికి ఆర్టికల్-3 ప్రకారం కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానం అవసరం లేదు. మెజార్టీ సీట్లు ఉన్న ప్రాంతం నుంచి మైనార్టీ సీట్లు ఉన్న ప్రాంతం వేరుపడతామంటే.. మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం వారు అడ్డుకుంటారనే ముందుమాపుతోనే డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఈ నిబంధనను చేర్చారు. ఈ కారణంగానే ఉమ్మడి ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసినా లెక్కలోకి లేకుండా పోయింది. సాక్షాత్తు రాజ్యాంగ నిబంధనలే తెలంగాణకు రక్షణ కవచంగా నిలిచినా.. మెజార్టీ ప్రాంతమైన ఏపీలో 175 స్థానాలు ఉన్నాయని, సీమాంధ్రప్రాంతానిదే అధిపత్యమని చెప్పి రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని ప్రదర్శించుకున్నారు.

వెనక్కిపోవడం అధర్మం కాదా?

ప్రజల ఆకాంక్షల మేరకే తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని రేవంత్ 'మీట్ ది ప్రెస్'లో కలరింగ్ ఇచ్చారు. రాజకీయంగా నష్టపోతామని తెలిసినా ధర్మంవైపు నిలబడ్డారని సోనియాగాంధీని పొగిడారు. అయితే, 2014లో తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ కరీంనగర్ సభలో హామీ ఇచ్చి బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకున్నారు. యూపీఏ కామన్ మినిమం ప్రోగ్రాంలో చేర్చారు. తెలంగాణను ఏర్పాటు చేస్తామని రాష్ట్రపతి ప్రసంగంలో స్పష్టంచేశారు. కానీ మాటతప్పారు. ఐదేండ్లు తెలంగాణ ఏర్పాటు హామీని అటకెక్కించారు. చట్టబద్ధమైన ప్రక్రియను ప్రారంభించలేదు. ఆ తర్వాత ఐదేండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత కేసీఆర్ నిరాహారదీక్ష చేస్తే డిసెంబర్ 9న ప్రకటన చేశారు. అనాడు ఉద్యమం తీవ్రతతో సాక్షాత్తు సీఎం రోశయ్య శాంతిభద్రతలు అదుపుతప్పాయని, తన వాళ్ల కాదంటూ చేతులు ఎత్తేశారు. ఈ పరిస్థితుల్లోనే ఉద్యమానికి తలొగ్గి, అనివార్య పరిస్థితుల్లో తప్పనిసరై మాత్రమే తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేశారు. కానీ ఆంధ్రా ఎమ్మెల్యేలు రాజీనామాలు చేస్తే వారి బెదిరింపులకు లొంగి డిసెంబర్ 23న తెలంగాణ ఏర్పాటు ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. దీంతో విద్యార్థి యువత అంతా నిరాశ నిస్పృహలకు లోనై బలిదానాలు చేసుకోవాల్సి వచ్చింది. తెలంగాణ ప్రజలు, ఉద్యమనేత కేసీఆర్ పోరాడి మళ్లీ తెలంగాణ ఇవ్వాల్సిన పరిస్థితిని కల్పించారు. ఉద్యమం తారాస్థాయికి చేరి ఒత్తిడి తీవ్రమడంతోనే తెలంగాణ ఇచ్చారు. తప్పు తెలంగాణపై ప్రేమతోకాదని పలుమార్లు స్పష్టమైంది. సోనియాగాంధీని బలిదేవత అన్ననోటితోనే రేవంత్ ఇప్పుడు క్రెడిట్ అంతా సోనియాదే అన్నట్టుగా వ్యాఖ్యానించడం విడ్డూరం. ఒక చోట నష్టపోతామని తెలిసి కూడా సోనియా త్యాగం చేశారని రేవంత్ చిలుకపలుకులు పలుకడం మరీ దారుణం. మరీ ధర్మంగా డిసెంబర్ 9 ప్రకటనపై సోనియా ఎందుకు నిలబడలేదో రేవంత్ సెలవిస్తే సరి.

సెటిలర్ల ఓట్లపై దొంగప్రేమ

> రేవంత్‌రెడ్డి సెటిలర్ల ఓట్లను లక్ష్యంగా చేసుకునే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని రాజకీయ పరిశీలకులు అంచనాలేస్తున్నారు. రేవంత్‌రెడ్డి 'మీట్ ది ప్రెస్'లో పాల్గొనడానికి కంటే ముందే ఉదయం 11 గంటలకు పచ్చి సమైక్యవాది, ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. చంద్రబాబు సూచనతోనే తాను రేవంత్ రెడ్డితో భేటీ అయినట్టు శ్రీనివాస్ పేర్కొనడం గమనార్హం. ఆ తర్వాత 12 గంటల ప్రాంతంలో ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న రేవంత్.. 'సాంకేతికంగా తెలంగాణను ఇవ్వాల్సిన అవసరం లేకుండే' అంటూ వ్యాఖ్యానించారు. చంద్రబాబు చొరవతోనే కొలికపూడి శ్రీనివాస్‌ను రేవంత్ కలిశారని, తెలంగాణలోని సెటిలర్ల ఓట్ల కోసం తెలంగాణ పుట్టుకనే ప్రశ్నిస్తూ రేవంత్‌రెడ్డి అవమానకరంగా మాట్లాడినట్టు స్పష్టమవుతున్నది. ఇక తన కోణంలో అధిపత్యమని తనలోని సమైక్య కోణాన్ని ఆవిష్కరించారు. తానింకా చంద్రబాబు చేలానేనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ కాంగ్రెస్‌లో ఉన్నా తన ఆత్మంతా సమైక్యవాదం చుట్టే తిరుగుతుందని, చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్ ఇలా మాట్లాడుతున్నారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

సీపీఎం బాటలోనే సీపీఐ

- పొత్తు నిర్ణయం అధిష్ఠానానిదే..
- పొత్తు ధర్మం పాటించని కాంగ్రెస్: కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నాలు బెడిసికొట్టడంతో సీపీఎం బాటలోనే నడవాలని సీపీఐ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో కాంగ్రెస్ వైఖరిని ఆ పార్టీ నేతలు తప్పుబట్టారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వామపక్షాల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని, రాష్ట్ర స్థాయిలో లౌకిక పార్టీలకు అది ప్రాధాన్యం కల్పించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పొత్తు ధర్మం పాటించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక కూటమి తరపున సీపీఎంతో కలిసి 45కి పైగా స్థానాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ ముఖ్య నేతలు నిర్ణయించారు. దీనిపై సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానంపై తుది నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఆ పార్టీ కేంద్ర సమితికి నివేదించింది.

రాజస్థాన్‌లో అవినీతి, ధరలు పెరిగాయి

- ఐదేండ్ల కాంగ్రెస్ పాలనపై ఎన్డీటీవీ సర్వేలో వెల్లడి

జైపూర్, నవంబర్ 3: రాజస్థాన్‌లో ఐదేండ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి, ధరలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయాయని మెజారిటీ ఓటర్లు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలను ప్రథమ, ద్వితీయ ప్రాధమ్యాలుగా వారు భావిస్తున్నారు. ఎన్డీ టీవీ-సీఎస్‌డీఎస్ లోక్‌నీతి జరిపిన ప్రీ పోల్ సర్వేలో రాజస్థాన్ ప్రజలు పేదరికం, అభివృద్ధి లేమికి మూడు, నాలుగో ప్రాధాన్యతను ఇవ్వగా అవినీతి అంశం తీవ్ర సమస్యని కేవలం 7% మాత్రమే భావించారు. ఆశ్చర్యకరంగా ఐదేళ్ల గెహ్లాట్ పాలనలో ధరలు బాగా పెరిగిపోయాయని 72%, అవినీతి పేరుకుపోయిందని 54% మంది అభిప్రాయపడ్డారు. 40% మాత్రం రాష్ట్రంలో ఎదుర్కొంటున్న నిరుద్యోగంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 30 అసెంబ్లీ స్థానాల్లో మూడు వేల మందిని అక్టోబర్ 24 నుంచి వారం పాటు ప్రశ్నించి ఈ సర్వే నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దవాఖానలు, స్కూళ్లకు ప్రశంసలు దక్కగా, చాలా విషయాల్లో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం మీద కాంగ్రెస్, ముఖ్యమంత్రి రాష్ట్రానికి చేయాల్సింది ఇంకా ఉందని పలువురు అభిప్రాయ పడ్డారు.

క్లాట్ దరఖాస్తుల గడువు 10కి పెంపు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : నేషనల్ లా స్కూల్స్, వర్సిటీల్లో లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) దరఖాస్తుల గడువును ఈ నెల 10 వరకు పొడిగించారు. ఈ గడువు శుక్రవారం ముగియగా, తాజాగా మరోసారి అవకాశం కల్పిస్తూ నేషనల్ లా యూనివర్సిటీస్ కన్సార్టియం నిర్ణయం తీసుకొన్నది.

పోలీసుపై జేడీయూ నేత దాడి

పాట్నా : బీహార్‌లోని సహర్స పోలీసులు గురువారం జేడీయూ నేత మహమ్మద్ ఒవైస్ కర్ని అలియాస్, ఆయన భార్య, మరికొందరిని అరెస్ట్ చేశారు. అసిస్టెంట్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రీటా కుమారిపై బుధవారం దాడి చేయడంతోపాటు, ఆమెతోపాటు ఉన్న పోలీసు బృందాన్ని పెట్రోలు పోసి తగులబెట్టేందుకు వీరు ప్రయత్నించినందుకు ఈ చర్యలు తీసుకున్నారు. అంతకుముందు ఓ పోలీసు బృందంపై దాడి చేసిన కేసులో కర్నిని అరెస్ట్ చేయడం కోసం రీటా బృందం గ్రామానికి వెళ్లగా, కర్ని అనుచరులు దాడికి ప్రయత్నించారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐఎస్ఎఫ్‌లో..

**సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో స్పోర్ట్స్ కోటాలో కింది ఖాళీల భ